క్లుప్తంగా

14 నుంచి క్రికెట్ టోర్నీ

రాయచోటి టౌన్ : ఈ నెల 14వ తేది నుంచి నియోజక వర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నక్కవాండ పల్లె సమీపంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ 100లు మాత్రమేనన్నారు. వివరాలకు ఉదయ్‌కిరణ్‌రెడ్డి 7288982631, హరినాథరెడ్డి 9985917375, సురేష్‌కుమార్‌రెడ్డి 9182377103 లను సంప్రదించాలన్నారు. టీం ఎంట్రీ కోసం గ్రామ సచివాలయంలో నమోదు చేసుకోవచ్చన్నారు.

అభినందనలు

రాయచోటి : ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్ ఫోరం అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని డీఈఓ శ్రీరామ పురుషోత్తం అభినందించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ, డీవైఈఓ వరలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ నాగముని రెడ్డిలను కలిశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేయాలని నూతన కార్యవర్గ సభ్యులకు సూచించారు. అనంతరం ఏపీపీఎస్‌టీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.భాస్కరన్, ప్రకాష్ రెడ్డి, అంజనేయులు, పీఎల్ఎన్ శాస్త్రీ, జగన్‌మోహన్ రెడ్డి, రామయ్య, అరవింద్ రెడ్డిలు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

రాజంపేట రూరల్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు పెనిగలపాటి చంద్ర ఆర్థిక సహకారంతో శుక్రవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాలలోని రహదారుల పక్కన, రైల్వేస్టేషన్, ఫ్లై ఓవర్ కింద తలదాచుకుంటున్న నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని క్లబ్ సభ్యులు తెలిపారు.

తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్టు

చిట్వేలి : మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 2580లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలియజేశారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రపంచం మెచ్చిన మేధావి స్వామి వివేకానంద

- ఘనంగా స్వామి వివేకానంద జయంతి
- నివాళులర్పించిన విద్యార్థులు

నందలూరు(రాజంపేట) : నేటి యువత స్వామి వివేకానందని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయిగ్రేస్ తెలియజేశారు. విజయవాడ యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలలో భాగంగా స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ వివేకానందుడు రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడని, వేదాంత, యోగాతత్వ శాస్త్రములలో సహజముపై అత్యంత ప్రభావము కలిగించిన ఒక ప్రఖ్యాత ఆధ్యాత్మిక నాయకుడని, హిందూ తత్వ చరిత్ర, భారతదేశ చరిత్రలోనే ఒక ప్రముఖ వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.దేవి, ఎస్ఎస్ఎస్ అధికారులు పి.నీలవేణి, కళాశాల సిబ్బంది, స్టెప్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : స్వామి వివేకానంద ప్రపంచం మెచ్చిన మేధావని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద సూక్తులను ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినోద్‌కుమార్ యాదవ్, జేకే నాగరాజు, ఆదినారాయణ, రమణ, నవీన్‌కుమార్, సూర్యచంద్ర, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు షేక్ అబ్దుల్లా, ఆర్ఎస్ఎస్ నాయకులు అఖిల్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట టౌన్: వివేకానంద విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం


చిట్వేలి: వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఎన్‌సీసీ ట్రూప్ అధికారి పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ లేవండి, మేల్కొనండి మీలో ఉన్న శక్తిని గ్రహించండి అనే ఇతి వృత్తంతో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, దుర్గరాజు, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రమీల, వెంకట సుహాసిని, కిరణ్ కుమార్ రాజు, ఎన్‌సిసి సార్జెంట్ శరత్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలి

పెనగలూరు (ఓబులవారిపల్లి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలని జెడ్పీటీసీ సుబ్బరాయుడు, పెనగలూరు ఉప సర్పంచ్ చిన్న వెంగల్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం పెనగలూరు పంచాయతీ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఒక్కొక్క పథకం గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అందనివారికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

చిన్నమండెం మండలంలో

చిన్నమండెం : మండల పరిధిలోని టి.చాకిబండ, దిగువగొట్టివీడు గ్రామాల్లో శుక్రవారం వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించినట్లు ఎంపీడీఓ దివ్య తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ జమీలాబేగం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలపడానికి వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ గీత, ఈఓపీఆర్డీ పవన్‌కుమార్, ఏపీఓ మాధవి, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


రాజంపేట రూరల్: కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఊటుకూరులో

రాజంపేట రూరల్ : వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిధిలోని ఊటుకూరు పంచాయతీలో మండల అధికారులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పంపించిన వ్యాన్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల పథకాల గురించి వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ టి.హరిప్రసాద్‌రెడ్డి, పీఎస్ ఆర్‌వీ శ్రీకాంత్, ఆకేపాడు పీహెచ్‌సీ వైద్యులు నరేష్, పంచాయతీ సెక్రటరీ ఈశ్వరయ్య, వైద్య బృందం, అంగనవాడీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులకు మండలంలోని రాఘవరాజుపురం, బొజ్జవారిపల్లి గ్రామ ప్రజలు ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయించి ప్రమాదాలు నివారించాలని శుక్రవారం విన్నవించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చామని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు వేయించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివసాయి, జి.సుధాకర్ పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

రాయచోటి టౌన్ : నిరాశ్రయులకు సోమలరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివరాజు ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ సలహా సభ్యుడు దిన్నెపాడు రవిరాజు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం రాత్రి రాయచోటి పట్టణంలో సంచరిస్తున్న 200 మందిని గుర్తించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండర్ కుమారుడు ఇషాక్ రాజు, సలహాదారుడు డేనియల్ కొప్పోలు, వీరబల్లె జాహ్నవి పాల్గొన్నారు.

అలరించిన రంగవల్లుల పోటీ

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, ఆర్ఎస్ రోడ్డులో జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకులు ఎల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళలు వెలువెత్తారు. ఎంబలూరు కళ్యాణి ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి ఝాన్సీలక్ష్మి, తృతీయ బహుమతి వెంకట సుబ్బమ్మలు అందుకున్నారు. అనంతరం నిర్వహించిన మ్యూజికల్స్ చైర్స్ పోటీలలో వివాహితలు అత్యంత ఆనందంగా పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

16 నుంచి చెయ్యేరులో సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పురస్కరించుకొని నందలూరు మండల పరిధిలోని ఇసుకపల్లి సమీపంలోని చెయ్యేరులో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు గుండు మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో భాగంగా సమీప ప్రాంతాల్లోని ప్రజలు పండుగ చివరిరోజున ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడపడం గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోందని, పిల్లలకు, పెద్దలకు సంతోషాన్ని కలిగించేందుకు ఈ ఏడాది కూడా ఇసుకపల్లి, కుమ్మరపల్లి, హరిజనవాడ, రాచపల్లి గ్రామ ప్రజల సహకారంతో కనుమ పండుగ రోజు 16వ తేదీ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మధ్యాహ్నం ఎద్దుల బండ్ల పోటీలు, సాయంత్రం ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలియజేశారు. పోటీలలో పాల్గొనడానికి ఎటువంటి ప్రవేశ రుసుం లేదన్నారు. ప్రజలందరూ పాల్గొని సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి ఆకేపాటి ఎస్టేట్‌లో సంక్రాంతి సంబరాలు

రాజంపేట రూరల్ : సంక్రాంతి పండుగను పుస్కరించుకొని దివంగత ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం 13వ తేదీ నుంచి ఆకేపాటి ఎస్టేట్‌లో ఘనంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఆకేపాటి ఎస్టేట్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 13వ తేదీ శనివారం మధ్యహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ముగ్గుల పోటీల నిర్వహించనున్నట్లు తెలియజేశారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.4016, ద్వితీయ బహుమతిగా రూ.3016, తృతీయ బహుమతిగా రూ.2016, కన్సలేషన్ బహుమతిగా ఇద్దరికి రూ.1000 వంతున అందజేయనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతి ఇస్తామన్నారు. 14న బండ లాగుడు పోటీలు ఉంటుందన్నారు. అనంతరం బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు తాడు లాగుడు (టగ్ ఆఫ్ వార్) పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పాల్గొన్న వారికి సంక్రాంతి బహుమతులు అందజేయనున్నట్లు తెలియజేశారు.

సంస్కృతి, సాంప్రదాయాల్లో పండుగలు భాగమే

రాయచోటి అర్బన్ : హిందూ సంస్కృతి, సాంప్రదాయాలలో పండుగలు ఒక భాగమని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని సాయిబాబా మందిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మహిళలను మరింగా ఉత్తేజపరిచేందుకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందివ్వడం అభినందనీయం అన్నారు. పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ బయారెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను అందరూ ఆచరించాలన్నారు. సనాతన సాంప్రదాయన్ని భావితరాలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నిర్మల్‌కుమార్, మాజీ అధ్యక్షుడు మహమ్మద్, సభ్యులు హరీష్‌చంద్ర, వినోద్‌కుమార్ నాయక్, సాయిబాబా ఆలయం కార్యదర్శి రతీంద్రారెడ్డి, దాతలు జంగం రెడ్డి, సురేంద్రారెడ్డిలు పాల్గొన్నారు.


పోటీలో విజేతకు బహుమతులు అందజేస్తున్న రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా

అభివృద్ధి పథం.. అన్నమయ్య జిల్లా కేంద్రం

- వ్యాపార కేంద్రంగా విస్తరిస్తున్న రాయచోటి
- అధునాతన సౌకర్యాలతో ఆస్పత్రులు, హోటళ్లు

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి అభివృద్ధిలో దినదినాభివృద్ధి చెందుతోంది. వైఎస్ఆర్‌సీపీ పాలనలో రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయడంతో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటితోపాటు ప్రైవేట్ పరంగా జరిగిన ప్రగతి కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. రాయచోటి అన్ని రంగాలతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనూ ఎగబాకింది. ఫలితంగా పట్టణ పరిధి విస్తరించింది. కడప - రాయచోటి జాతీయ రహదారి పక్కనే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. విద్యాపరంగా ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలతోపాటు ఇంటర్, డిగ్రీ, పీజీ, వృత్తి విద్య, ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రిని నిర్మించి, అధునాతన వసతులతో వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అలానే ప్రైవేట్ వైద్యులు సైతం తమ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తుండటం విశేషం.

హోటల్స్, వసతి సౌకర్యాలు

రాయచోటి కేంద్రంగా హోటల్స్ వసతి గృహాల స్థాయి కూడా భారీగా పెరిగింది. ఒకప్పుడు చిన్నచిన్న లాడ్జిలు.. హోటల్స్ ఉన్న రాయచోటిలో ఇప్పుడు స్టార్ హోటల్స్ స్థాయి తగ్గ హోటళ్లను ప్రారంభిస్తుండగా, అందులోనే కన్వెన్షన్ హాల్‌ను అందుబాటులోకి తీసుకువస్తుండటం ప్రత్యేకం. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే ఇతర ప్రాంతాల రుచికరమైన వంటకాలను హోటల్స్ అందిస్తున్నాయి. ఇందుకు అదనంగా పట్టణం వాణిజ్య, వ్యాపార కేంద్రంగా ముందుకు సాగుతోంది. బట్టలు, బంగారు, నిత్యావసర సరుకుల విక్రయాలకు పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ ఏర్పాటయ్యాయి. ప్రజలకు అనువుగా ఉండేలా ఆర్టీసీ బస్టాండ్ విస్తరణతో మరింతగా రవాణా సౌకర్యం మెరుగుపడింది. పట్టణ పరిధిలో సిమెంట్, కడ్డీలు, కలర్స్ దుకాణాలు విరివిగా వెలిశాయి. ద్విచక్ర ఇతర వాహనాల షోరూమ్‌లు అందుబాటులోకి వచ్చాయి.


జిల్లా కేంద్రంలో ఏర్పాటైన ఆస్పత్రి సముదాయం